చేనేత సమస్యలు పరిష్కరించాలి

● మంత్రి తుమ్మలకు చేనేత కార్మికుల వినతి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న చేనేత నాయకులు, చిత్రంలో ఎమ్మెల్యే వీరేశం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 16 : చేనేత సమస్యలను పరిష్కరించాలని పోచంపల్లి చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు భారత వాసుదేవ్, పిల్లలమర్రి శ్రీనివాస్, సిరిపురం చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు అప్పం రామేశ్వర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత మిత్ర, త్రిష్ట పథకాలను యథావిధిగా కొనసాగించాలని, యారన్ సబ్సిడీ 40 శాతం స్థానంలో నగదు బదిలీ కింద జియోట్యాగ్ చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులకు ప్రతి నెలా రూ.3వేలు ఇవ్వాలని కోరారు. ఇల్లు లేని చేనేత కార్మికులకు వర్క్ షెడ్ కం ఇండ్ల నిర్మాణాలకు రూ.6లక్షలు ఇవ్వాలన్నారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మృతిచెందిన చేనేత, అనుబంధ కార్మికులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, టెస్కోను బలోపేతం చేసి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు, కార్మికుల వ్యక్తిగత లోన్లు లక్ష రూపాయల వరకు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు.

అద్భుతంగా పుష్కరిణి

● సర్వ హంగులతో పాతగుట్ట ఆలయ పుష్కరిణి ఆధునీకరణ

పాతగుట్ట ఆలయ పుష్కరిణికి తుది మెరుగులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 16 : పాతగుట్ట (పూర్వగిరి) లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేలా పుష్కరిణి మహాద్భుతంగా రూపుదిద్దుకుంటున్నది. ఒకవైపు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా, మరోవైపు భక్తులకు ఆటంకం లేకుండా నిర్మాణాలు సాగుతున్నాయి. పుష్కరిణి ఆధునీకరణకు హైదరాబాద్‌లోని మల్కాజిగిరి అమ్మగూడకు చెందిన పుట్టకోట వంశీ రూ.15 లక్షలు, స్వామివారి ఆలయం వద్ద నుంచి పుష్కరిణి వరకు మెట్ల ఆధునీకరణకు పాతఆల్వాల్‌కు చెందిన మాదిరెడ్డి ప్రణవ్‌రెడ్డి, తోట ధనుజంయ్‌రెడ్డి రూ.15 లక్షలు విరాళం ఇచ్చారు. గతంలో రాళ్లతో కూడిన గోడలు కలిగిన పుష్కరిణి చుట్టూ 7 ఫీట్ల వెడల్పుతో నాలుగు వరుసల గ్రానెట్ ఫ్లాట్ ఫామ్‌లు, చుట్టూ నాలుగు విద్యుత్ స్తంభాలు, ఆహ్లాదాన్ని పంచే విధంగా వివిధ రకాల 200 మొక్కలను నాటారు. భక్తులకు ఇబ్బంది వాటిల్లకుండా గుండం చుట్టూ స్టీల్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గుండం మధ్యలో స్వామివారి మండపాన్ని నిర్మిస్తున్నారు. మండపంలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.పాతగుట్ట ఆలయం నుంచి పుష్కరిణి వరకు వెళ్లేందుకు గతంలో ఉన్న రాళ్లతో కూడిన మెట్లను ఆధునీకరిస్తున్నారు. 110 మెట్లను పొడిగిస్తూ గ్రానైట్‌తో నిర్మిస్తున్నారు. మెట్లకు ఇరువైపులా స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 19 నుంచి పాతగుట్ట స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి చక్రతీర్థ స్నానం లోపు పూర్తి చేసేలా పనులు చేపడుతున్నారు.

కల్యాణ మండపం చుట్టూ నిర్మాణాలు నిలిపివేయాలి

● ఆలయ ఈఓ రామకృష్ణారావు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ పాతగుట్ట (పూర్వగిరి) లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణంలో గల కల్యాణ మండపం (పాత) చుట్టూ ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు కల్యాణ మండపం చుట్టూ ఉన్న పట్టాదారులకు నోటీసులు జారీ చేశారు. పాత గుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం నుంచి కల్యాణ మండపం చుట్టూ స్వామివారి రథోత్సవం ఉంటుందని, నిర్మాణాలు చేపడితే రథోత్సవానికి తీవ్ర ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రథం ఊరేగింపు వెళ్లే ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే కల్యాణ మండపం చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని అన్నారు.

ఘనంగా భద్రావతీ భావనారుషి కల్యాణం

చౌటుప్పల్, ఫిబ్రవరి 16 : పట్టణంలోని శివభక్త మార్కండేయస్వామి దేవాలయంలో శుక్రవారం భద్రావతీ భావనారుషి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింహ, భక్తులు పాల్గొన్నారు.

పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : పట్టణంలోని రాయగిరి గ్రామానికి చెందిన పాడి రైతు మచ్చ మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతని కుటుంబ సభ్యులకు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నుంచి రూ.10వేల ఆర్థిక సాయాన్ని సొసైటీ కార్యదర్శి బెజ్జంకి రామకృష్ణారెడ్డి శుక్రవారం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం తోడ్పాటునందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు రాయగిరి, యాదగిరి, దశరథ, కృష్ణ, భువనగిరి, మల్లేశ్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలి

● జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల పరిధిలో ప్రారంభించిన పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సబ్‌కా యోజన, సబ్‌కా వికాస్ మండల ప్రణాళికా సమావేశంలో ఆయన మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు ఇంజినీరింగ్ శాఖల పరిధిలో రూ.2.10కోట్లతో పలు నిర్మాణాలను ప్రతిపాదించగా నేటికీ చాలా పనులు పూర్తి కాలేదన్నారు. అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రారంభించని పనులను ప్రారంభించాలని సూచించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందించాలన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ధనావత్ బిక్కునాయక్, సీఈఓ శోభారాణి, డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీలు సుబ్బూరు బీరుమల్లయ్య, పల్లా వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌గుప్తా, అనూరాధ, వాకిటి పద్మ, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పరిపూర్ణాచారి, డీఏఓ అనూరాధ, జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి, ఉద్యాన వన శాఖ జిల్లా అధికారి అన్నపూర్ణ పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో వృద్ధుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

బీబీనగర్, ఫిబ్రవరి 16 : బాలికపై లైంగికదాడి కేసులో ఓ వృద్ధుడికి 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ భువనగిరి కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన మర్కల సాయిలు (77) 2018 జనవరి 18న ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదైంది. విచారించిన కోర్టు సాయిలుకు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : పట్టణంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ బోడుప్పల్‌కు చెందిన కడియాల శంకర్‌రెడ్డి (45) వ్యక్తిగత పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై భువనగిరి వచ్చి తిరిగి వెళ్తుండగా పట్టణంలోని చెరువు కట్ట సమీపంలో లారీ ఢీకొట్టింది. దీంతో లారీ చక్రాల కింద పడ్డ శంకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

ఏపీలో యువకుడు..

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా నకరికల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భువనగిరి మండలం చీమలకొండూరు గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చీమలకొండూరు గ్రామానికి చెందిన మరిపల్లి రాజు (30) డీసీఎం డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చెన్నై నుంచి డీసీఎంతో వస్తుండగా మార్గమధ్యలో పల్నాడు జిల్లా నకరికల్ పట్టణంలో ముందున్న లారీ సడన్ బ్రేక్ వేసింది. దీంతో లారీని డీసీఎం ఢీకొట్టగా తీవ్రంగా గాయపడిన రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

మోత్కూరు, ఫిబ్రవరి 16 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన వంగాల బుర్రుడు (35) మృతిచెందాడు. గ్రామంలో యువకుడి మృతదేహానికి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేశ్ శుక్రవారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిట్ట సాయికుమార్, దాసరి నవీన్, కందుకూరి సురేందర్, గడ్డం చంద్రయ్య, లక్ష్మయ్య, నర్సింహ పాల్గొన్నారు.

పిల్లలు పక్షవాతం బారిన పడకుండా చూడడమే లక్ష్యం



మాట్లాడుతున్న సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురారి

● మార్చి 3, 4, 5తేదీల్లో పల్స్ పోలియోకు ఏర్పాట్లు చేసుకోవాలి

● సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురారి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 16 : భావి భారత పౌరులను పక్షవాతం బారిన పడకుండా చూడడమే ఓరియంటేషన్ వర్క్‌షాప్ లక్ష్యమని, అందుకే పల్స్ పోలియోపై అవగాహన కల్పిస్తున్నామని సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురారి అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై డాక్టర్లు, సూపర్‌వైజర్లకు ఒక్క రోజు ఓరియంటేషన్ వర్క్‌షాప్‌ను శుక్రవారం పట్టణంలోని వెటర్నరీ మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3, 4, 5 తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. మొదటి రోజు ఉదయం 6నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో కేంద్రాల్లో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రామ పెద్దలు, అధికారులతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని, దీనికి ముందురోజు అన్ని శాఖలతో జిల్లా, మండల, గ్రామస్థాయిలో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొదటి రోజే 90 శాతం పూర్తి చేయాలని, మొదటి రోజు రాలేని పిల్లలకు 4, 5 తేదీల్లో ఇంటికి వెళ్లి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక టీమ్‌లు.. సెటిలర్లు, హైరిస్క్ ఏరియాల్లో పిల్లలకు మొబైల్ టీమ్‌ల ద్వారా పోలియో చుక్కలు వేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ పరిపూర్ణాచారి మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీ వైద్యాధికారి పరిధిలోని గ్రామాల్లో సూక్ష్మ ప్రణాళిక తయారు చేసుకొని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. ప్రతి రోజూ కార్యక్రమం ముగిసిన వెంటనే సిబ్బందితో సమీక్ష జరుపాలని, ప్రగతిపై నివేదిక సమర్పించాలని సూచించారు. సమావేశంలో భువనగిరి, చౌటుప్పల్ వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఉప అధికారులు డాక్టర్ శిల్పిని, డాక్టర్ యశోద, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ, వైద్యులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ఆత్మకూరు(ఎం) : డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 16 : మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేసి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి ఆటో డ్రైవర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలకు గిరాకీ లేక అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గణేశ్, అజీజ్, మల్లేశ్, శంకర్, చంద్రయ్య, మల్లయ్య, పరశురాములు, షాహీన్, కార్తీక్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల రాస్తారోకో

ఆలేరు రూరల్ : మండలంలోని కొలనుపాకలో సోమేశ్వర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ ఫైనాన్స్‌లో తెచ్చిన ఆటోలకు సకాలంలో ఈఎంఐలు చెల్లించే పరిస్థితులు లేక చాలా మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి ఆటో డ్రైవర్ల కష్టాలను తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాండుగౌడ్, కృష్ణగౌడ్, నర్సింగరావు, నరేశ్, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

తుర్కపల్లి, ఫిబ్రవరి 16 : మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి డప్పుచప్పుళ్లు, మంత్రోచ్చరణల మధ్య పూజారులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం అమ్మవారికి భక్తులు ఒడిబియ్యం పోశారు. కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా సుశీలారవీందర్, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రి మేడారం జాతర పోస్టర్ ఆవిష్కరణ

చల్లూరు మేడారం జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

రాజాపేట, ఫిబ్రవరి 16 : మండలంలోని చల్లూరులో ఈ నెల 20 నుంచి జరిగే యాదాద్రి మేడారం జాతర పోస్టర్‌ను యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు విచ్చేసి వనదేవత ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భువనగిరిలో గులాబీ జెండా ఎగురాలి

● దూదిమెట్ల బాలరాజుయాదవ్

ఆత్మకూరు(ఎం)లో మాట్లాడుతున్న గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బాలరాజు యాదవ్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 16 : కేంద్రంలో తెలంగాణ హక్కులు గెలువాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరిలో గులాబీ జెండా ఎగురాలని గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన 6గ్యారెంటీల వాగ్దానాలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి 70రోజులు గడుస్తున్నా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆరోపించారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు కోరె భిక్షపతి, వెంకన్న, మల్లేశంగౌడ్, ఉపేందర్‌రెడ్డి, రాంబాబు, బీరప్ప, నర్సయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

● పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి సూచన



డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 16 : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు భాగస్వాములు కావాలని డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఆలేరు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఆయన సమావేశమై పలు అంశాలపై సూచనలు చేశారు. అనంతరం డీఎల్‌పీఓను పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. సమావేశంలో ఎంపీఓ సలీమ్, కార్యదర్శులు రాహుల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శశికాంత్‌గౌడ్, మల్లేశ్, కనకరాజు, తిరుమలాచారి, ఇందిర, మీనాబాయి, స్వప్న పాల్గొన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

● మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 16 : పోచంపల్లి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అంచనా బడ్జెట్ రూపొందించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి అన్నారు. పురపాలక భవనంలో శుక్రవారం ఆమె అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి ప్రవేశపెట్టారు. సాధారణ అంచనా ఆదాయం రూ.486.74 లక్షలు, వ్యయం రూ.475.58 లక్షలు, ప్రభుత్వ ఆదాయం, వ్యయం రూ.1,562 లక్షలుగా బడ్జెట్ రూపొందించారు. ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలకు రూ.170 లక్షలు, పారిశుధ్య నిర్వహణకు రూ.36.10 లక్షలు, గ్రీన్ బడ్జెట్ (10 శాతం) రూ.29.54 లక్షలు, నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ నిర్వహణకు రూ.59.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

లక్ష గాయత్రీ మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా గాయత్రీ మహాయజ్ఞం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 16 : పట్టణంలోని మార్కండేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవాలయంలో లక్ష గాయత్రీ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రావతీ భావనారుషి కల్యాణం జరిపించారు. భ్రమరాంబదేవి సహస్రనామ కుంకుమార్చన, శివ పంచాయతన యజ్ఞం, భద్రావతీ భావనారుషి అష్టోత్తర శత నామావళి పూజా కార్యక్రమాలు చేపట్టారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బడుగు చండీకేశ్వర్, ఉపాధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి మంగళపల్లి రాజారమేశ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలపై కార్మికుల కన్నెర్ర

● జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

భువనగిరి అర్బన్ : భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులు, కర్షకులు కన్నెర్ర చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త గ్రామీణ బంద్‌లో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, కార్మికుల హక్కులను కాపాడాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వలిగొండలో రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రామన్నపేట, చౌటుప్పల్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. మోత్కూరులో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. గుండాలలో తాసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి రోడ్డుపై రాస్తారోకో చేశారు. భువనగిరి పట్టణంలో సాయిబాబా గుడి నుంచి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మోటకొండూర్‌లో అంబేద్కర్ చౌరస్తా నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. రాజాపేట, ఆత్మకూరు(ఎం), భూదాన్ పోచంపల్లిలో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు.

ఆత్మకూరు(ఎం) : రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గుండాల : ధర్నా చేస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు

మోత్కూరులో నిరసన ర్యాలీ చేపడుతున్న కార్మికులు

సంస్థాన్ నారాయణపురం : ధర్నా చేస్తున్న నాయకులు

రాజాపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

రామన్నపేటలో నిరసన తెలుపుతున్న కార్మికులు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Tirumalagiri Branch వారు ఇచ్చిన బొగొట్టు ప్రకారం యావన్మందికి తెలుపునది ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తి రిజిస్టార్ తనఖా చేయించుకొని, శ్రీ/శ్రీమతి చుక్క సుశీల, భర్త: యాదగిరి అలియాస్ యాదయ్య గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకోన్నాము. కావున సదరు వ్యవహారముకు సంబంధించి, సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్సు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నాటి నుండి (7) ఏడు దినములలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కాదు.

SCHEDULE OF THE PROPERTY

జిల్లా రిజిస్టారు నల్లగొండ, సబ్-రిజిస్టారు సూర్యాపేట వారి జ్యూరిస్ డిక్షన్‌లోనూ, జిల్లా పరిషత్ యాదాద్రి భువనగిరి, మండల పరిషత్ అడ్డగూడూరు, గ్రామ పంచాయితీ బోర్డు చినపడిశాల, చిన్నపడిశాల గ్రామ శివారులో గల ఇల్లు ఇంటి నెం. 2-19 గల దాని విస్తీర్ణము: 196.00 చ.గ.లు, సరియగు 163.88 చ.మీ.లలో కట్టుబడి విస్తీర్ణము: 100.00 చ.అ.లు ఏ.సి.సి.తో నిర్మించబడినట్టి ఇల్లు